# మొదటి ఆట సినిమా

ఉన్నవ మదనమోహనరావు




తెల్లవారేసరికి తలంటిపోసుకొని, పట్టు చీర ధరించి, కాళ్ళకు పసుపుపూసికొని, నుదుటను పావలా కాసంత తిలకంతో, అక్షతలు కాసిని భర్త చేతిలో వుంచి, వంగి పాదాలకు నమస్కరిస్తున్న బాలను చూసి ఆశ్చర్యపోయాడు సదరు భర్త రంగారావు

చేతిలో వుంచిన అక్షతలు భార్య తల మీద జల్లి, 'ఏమిటీ విపరీతం ? ఎందుకీ అకాల పతిభక్తి ? ఏ కోరిక సాధించటానికీ ప్రయాస ? బాలామణీ ?' అన్నాడు రంగారావు నాటకం ఫక్కీలో

'పోండి ! మీకన్నీ వేళాకోళం ! ఈవేళ నేను కాపురానికి వచ్చినరోజు ! అందుకని తలంటిపోసికొని నమస్కరించాను ! అంతే!' అని వెళ్ళిపోబోతున్న భార్య చెయిపట్టుకొని లాగి 'ఏమిటీ ! నీవు కాపురానికి వచ్చిన శుభదినమా ఈ రోజు ! మరి అయితే నీ హార్ది దండాలు ఏవరిక్కావాలోయ్ ! ఏదీ ! ఒక ము...' అంటున్న రంగారావును విడిపించుకొని వంట యింట్లోకి పోయింది బాల.

* * *

"సాయంత్రం పెందరాళే రండి ! పిక్చరుకు పోదాం ! అంతగా కాకపోతే మధ్యాహ్నం నుంచి సెలవన్నా పెట్టిరండి!" అన్నది ఆఫీసుకు వెళ్ళబోతున్న భర్త చేతికి టిఫిన్ బాక్సు అందిస్తూ !

'దేవిగారి ఆజ్ఞ అయింతరువాత దానిని ఉల్లంఘించటమా! అలాగే!' అని భయాన్ని అభినయిస్తున్న భర్తను చూసి చిన్నగా నవ్వుకొంది బాల.

అన్నమాట ప్రకారం సాయంత్రం ఒక గంట పర్మిషన్ తీసికొని ముందుగానే యింటికి వచ్చాడు రంగారావు.

కాఫీ-ఫలహారాలు ముగించుకొని అరగంటలో ఇద్దరూ తయారయ్యారు హుషారుగా.

బాల కాపురానికి వచ్చి సరిగా ఏడాది అయింది. ఈ యేడాదీ క్షణంలా గడిచి పోయింది యిరువురికీ !

ఆటోలో వెళ్ళదామా ! లేక బస్సులో వెళ్ళదామా అని రంగరావు ఆలోచిస్తుంటగా — యింతలో తలుపు తట్టిన చప్పుడయింది.

రంగారావు వెళ్ళి తలుపు తెరిచాడు ! ఎదురుగా గుర్నాథం కనిపించాడు ! 'రండి!' అంటూ లోపలికి ఆహ్వానించి కుర్చీ చూపించాడు రంగారావు. గుర్నాథం తన ఆఫీసు లోనే మరో సెక్షన్‌లో యు. డి. గా పని చేస్తున్నాడు.

'ఎక్కడికో బయలుదేర బోతున్నట్టున్నారే ! అన్నాడు గుర్నాథం; గది అంతా పరిశీలనగా చూస్తూ !

'ఏంలేదు ! అలా పిక్చర్‌కి పోదామని !' సంజాయిషీ యిచ్చుకొన్న వాడిలాగే సమాధానం చెప్పాడు రంగారావు.

ఆ సమయంలో గుర్నాథం వచ్చినందుకు బాలకు కోపంవచ్చింది ! అది గమనించిన రంగరావు జాలిగా బాలవైపు చూసి అతిధి మర్యాదకై కాఫీ పెట్టమని సంజ్ఞ చేశాడు.

'ఏదో పనిమీద వచ్చినట్టున్నారు ?' అడిగాడు రంగారావు లోలోపల టైము అయిపోతున్నందుకు బాధ పడుతూ.

'అవునోయ్! రంగారావు! చాల అవసరమైన పనిమీదనే వచ్చాను!' అన్నాడు గుర్నాథం.

'ఏమిటి?' అన్నట్టు చూశాడు రంగారావు.

ఇంతలో కాఫీ చేసి తెచ్చింది బాల.

కాఫీ సిప్ చేస్తూ అసలు సంగతి బయట పెట్టాడు గుర్నాథం! "ఏం లేదు ! రంగారావ్! నాకు అర్జంటుగా పదిహేను రూపాయలు కావాలి! ఆఫీసులో ఇద్దరి ముగ్గుర్ని, అడిగి చూశాను! లాభం లేక పోయింది. నెలాఖరు కదా. ఎవరి దగ్గరా లేదు. ఇంటో బియ్యం లేవు. ప్రొవిజన్

అన్నీ నిండుకొన్నాయి. ఇంకా రెండు రోజులు పోతేగాని జీతాలు రావు. నీమీదే ఆశ పెట్టుకొని వచ్చాను'' అన్నాడు దీనంగా.

రంగారావుకు పచ్చివెలక్కాయ గొంతువ పడ్డట్టయింది. తన దగ్గరకూడా ఎక్కువ లేవు. పదిహేడు రూపాయలే వున్నాయి. ఇక ఎటూ రెండు రోజుల్లో జీతాలు అందుతాయనే ధీమాతో బాల సినిమాకు పోదామని అడిగిందే తడవుగా ఒప్పుకొన్నాడు.

'నా దగ్గర కూడ ఎక్కువ లేవు. పదిహేడు రూపాయలే వున్నాయి. ఈ వేళ బాల కాపురానికి వచ్చిన రోజు. అంచేత సినిమా ప్రోగ్రామ్ పెట్టుకున్నాం' అన్నాడు రంగారావు.

గుర్నాధం జాలిగా చూశాడు రంగారావు వైపు. 'ఇంట్లో సరుకులన్నీ నిండుకొన్నాయి. పొద్దున గూడ పిల్లలు సరిగా తినలేదు. నా కోసం ఎదురు చూస్తుంటారు' అన్నాడు దీనంగా.

రంగారావు హృదయం ద్రవించింది! ఒక వైపు సాటిమిత్రుడు తిండికిలేక అవస్థపడుతుంటే తను దర్జాగా సినిమాకు వెళ్ళటమా!

భార్య దగ్గరకి వెళ్ళి గుర్నాధం ఎందుకు వచ్చిందీ చెప్పాడు. బాల ముఖంలో సంతోషం మాయమయింది. సూర్యాస్తమయానికి ముడుచుకుపోయిన కమలంలా అయింది.

'ఈయనకు మనమే దొరికామా!' అన్నది విసుగ్గా.

'ఇద్దరి ముగ్గుర్ని అడిగి చూశాట్ట! ఎక్కడా దొరకలేదుట! పాపం!'

''పోనీ బియ్యం ఇవ్వమంటాడేమో అడగండి!' అన్నది బాల సమస్యను పరిష్కరిస్తూ—

రంగారావు ముందుగదిలో కూర్చున్న గుర్నాధంతో 'పోనీ బియ్యంఇవ్వమంటారా!' అని అడిగాడు.

''ఒక్క బియ్యంతో తీరేది కాదుగా రంగారావ్! బియ్యం కావాలి! బొగ్గులు కావాలి! నూనె కావాలి! పాలసీసాకుకావాలి! సమస్తం కావలిసిందేగా! పోనీలే మీరు బాధపడకండి! ఇంకెక్కడన్నా ప్రయత్నించి చూస్తాను!'' అన్నాడు గుర్నాధం నిరాశగా.

రంగారావు హృదయంలోని సున్నితమైన భాగం చివుక్కుమన్నది! మానవత్వం పొంగింది! జేబులోంచి పదిహేను రూపాయలు తీసి గుర్నాధం చేతిలో వుంచాడు.

''సరే! తీసికోండి! మా అవసరం కంటె మీ అవసరంప్రధానమైనది కదా!'' అంటూ.

గుర్నాధం ముఖం వెయ్యి వోల్టుల బల్బులా మెరిసింది. లేచి నిలబడ్డాడు. ''చాల చాల థాంక్స్ రంగారావ్! సమయానికి ఆదుకొన్నావు! జీతం రాగానే నీ డబ్బు తిరిగి యిచ్చేస్తాను. యింటిదగ్గర పిల్లలు నాకోసం ఎదురుచూస్తుంటారు! వస్తా!'' అని మరోసారి కృతజ్ఞతలు తెల్పి వెళ్ళిపోయాడు గుర్నాధం.

గుర్నాధం డబ్బు తీసుకొని వెళ్ళిపోవటం చూసిన బాలకు ఏడుపు వచ్చినంత పనయింది.

'నెలాఖరు దాకా సరిపడే సరకులు ఒకేసారి ఎందుకు తెచ్చుకోరో? ఇలా వాళ్ళనీ—వీళ్ళనీ భాధించకపోతే' మనసులోని మాట బయటకు వచ్చింది బాలకు.

రంగారావు పరిస్థితి అర్థంచేసికొన్నాడు. సినిమాకని పొద్దుట నుంచీ ఎదురు చూసి తీరా ప్రయాణమైనాక విరమించుకోవటం తనకూ బాధగానే వుంది. కాని ఏంచేస్తాం?

''చూడు బాలా! ఇది మహా నగరం. మనం అంటే ఇద్దరమే కాబట్టి నెలాఖరులో ఈ మాత్రమైనా డబ్బులు మిగిలినాయి. ఇద్దరు ముగ్గురు పిల్లలుంటే ఎన్ని ఇబ్బందులు! రోగాలనీ— మందులనీ ఎన్ని ఖర్చులో. సాటివాణ్ని కష్టంలో ఆదుకోవటంకన్న మించిన సంతోషం ఏముంది చెప్పు. పాపం! ఇంట్లో తిండికి లేక బాధపడుతుంటే చూస్తూ మనం సినిమాకు వెళ్ళటం ఏం బాగుంటుందీ!'' భార్యకు నచ్చచెప్పటానికి ప్రయత్నించాడురంగారావు.

'ఈయనకు మనమే దొరికాముటండీ! మన సంతోషం అంతా పాడు చేశాడు' అంది బాల.

'సినిమా చూస్తేనే సంతోషమా బాలా! రేపు మనకు పిల్లలు కలిగితే మనకు మాత్రం అలాంటి అవసరం రాదని గ్యారంటీ ఏమిటి? ఇబ్బందిలో ఒకరికి సాయపడ్డామనే సంతృప్తి అయినా కలిగింది. అది చాలదూ! రేపు జీతం రాగానే వెళ్దాం సినిమాకి. సరేనా!' అంటూ చుబుకం పైకెత్తి కళ్ళలోకి చూస్తూ అన్నాడు రంగారావు.

'మీకు జీతాలు వచ్చేదాక ఆ సినిమా వుండొద్దూ! ఇవ్వాల్టితో ఆఖరుట!' అంది మూతిముడిచి పెట్టి బాల.

''పోనీ! మళ్ళా రాకపోతుందా! అప్పుడు చూదాం తప్పకుండా!''

'అప్పుడు మళ్ళీ ఇంకో స్నేహితుడు అప్పుకు రాడని నమ్మకం ఏమిటి?' అంటూ లోపలికి వెళ్ళి చీర మార్చుకోబోయింది బాల!

'అదేమిటి? చీర మార్చుకోవటం ఎందుకు? ఎలాగూ తయారై యే వున్నాంగా యిద్దరమూను. పిక్చర్‌కి కాక పోతే అలా పబ్లిక్ గార్డెన్‌నాకావెళ్ళి కాసేపు కూర్చొని వద్దాం పద!' బ్రతిమాలి ఎలాగో భార్యను ఒప్పించాడు రంగారావు.

ఇద్దరూ గార్డెన్ వైపు నడక సాగించారు కబుర్లు చెప్పుకుంటూ.

దారిలో మీరా టాకీసు కనిపించింది! ఆరోజే ఏదో పిక్చరు విడుదల అయిందికాబోలు! జనం విపరీతంగా వున్నారు — ఇసుక వేసినా రాలకుండా వున్నారు! ఆ జనాన్ని చూస్తూ కాసేపు నిలబడి పోయారు రంగారావు దంపతులు రోడ్డు మీద!

ఉన్నట్టుండి ''అటు చూడండి! ఆయనేగా ఇందాక మనింటికి వచ్చిన గుర్నాధంగారు!'' అంటూ వేలెత్తి చూపింది బాల, రెండు రూపాయల తొంభై పైసల బుకింగ్ దగ్గర క్యూలో ముగ్గురు పిల్లలతో నిలబడి టిక్కట్ల కోసం తంటాలు పడుతున్న గుర్నాధాన్ని చూపిస్తూ.

రంగారావు ఆశ్చర్యంగా చూశాడు! నిజమే! బాల చెప్పినట్టు గుర్నాధమే! అతను పిల్లలతో క్యూలో నించున్నాడు! భార్య బయట నిలబడింది!

'ఇప్పుడే పోయి ఆ వెధవను నాలుగు దులిపిరానా?' అన్నాడురంగారావుఆవేశంగా.

'ఆఁ! దులిపారులెండి. అది అంతే. కొంత మందికి సినిమా మోజు అలానే వుంటుంది. వాళ్ళు పస్తులన్నా వుంటారు గాని పిక్చర్ రిలీజ్ అయితే సరి- ఫస్ట్ డే— ఫస్ట్ షో చూచితీరాలిసిందే. అది నెలాఖరు కానీయండి. పిడుగులుపడేవర్షం కానీయండి. ఫస్ట్ డే- ఫస్ట్ షో చూడందే బ్రతకలేరు. అది చూట్టానికి ఎన్ని వేషాలయినావేస్తారు' అన్నది భర్త కళ్ళలోకి చూస్తూ బాల.

'స్కౌండ్రల్! మన ప్రోగ్రామ్ అంతా పాడు చేశాడు' అని పళ్ళు కొరుక్కొన్నాడు రంగారావు.